క్లుప్తంగా

ప్రపంచ ఫుట్‌బాల్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక


ఆరుష్

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామానికి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి మార్లపూడి మిత్ర ఆరుష్ ప్రపంచ ఫుట్‌బాల్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు టర్కీ దేశంలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు జరుగతాయని ఆరుష్ మంగళవారం తెలిపారు. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన సెలక్షన్స్‌లో ఆరుష్‌ను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆరుష్ సోమవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఆరుష్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలి

సఖినేటిపల్లి: పది పరీక్షల్లో ఉపాధ్యాయుల సూచనలు పాటించి ప్రణాళిక బద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. మంగళవారం అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తదనంతరం మండల స్థాయి బయాలజీ సబ్జెక్ట్ కాంప్లెక్స్ మీటింగ్ మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలోను, తెలుగు సబ్జెక్ట్ కాంప్లెక్స్ మీటింగ్ అంతర్వేదిపాలెం మధ్య గ్రూపులోను, మండల స్థాయి ప్రైమరీ, హైస్కూల్ స్థాయి కాంప్లెక్స్ మీటింగ్ గొంది జెడ్పీ ఉన్నత పాఠశాలలోను నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ జి.ప్రభావతి, ఎంఈవో-1, 2 డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు నరహరిశెట్టి సత్యనారాయణ, జాన కనకలింగేశ్వరరావు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈఓ సలీం బాషా

అయినవిల్లి: పది, ఇంటర్మీడియెట్‌లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు తగ్గ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని డీఈఓ షేక్ సలీం బాషా సూచించారు. నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వ్యాయమోపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈఓ సలీం భాషా మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులతో ముచ్చటించారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ పాఠశాల నుంచి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కంకిపాటి దేవిని అభినందించారు. ఆయన వెంట ఎంఈఓ-2 శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణ సదస్సు

పి.గన్నవరం: స్థానిక గ్రేస్ జూనియర్ కళాశాలలో పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం మహిళా సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల రక్షణ, మహిళలపై నేరాలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై వారికి ఎస్సై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, మహిళలపై జరిగే దాడులను ఏవిధంగా అడ్డుకోవాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రేస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, అధ్యాపక సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక చికిత్సకు సాయం

సఖినేటిపల్లి: మండలంలోని గొందిలోని విద్యుత్ షాక్ బాధిత బాలిక బర్రే దుర్గాభవానికి, గొంది ఎన్నారై కువైట్ యూత్ మంగళవారం రూ.25 వేలు నగదు సాయం చేశారు. ఈ మేరకు పై సాయాన్ని స్థానిక ఎంపీటీసీ కొల్లాబత్తుల నాని, గొంది ఎన్నారై కువైట్ వ్యవస్థాపకులు బీర జయకుమార్, దొండపాటి రమేష్‌లు భవానీకి చికిత్సకై ఇంటి వద్ద అందజేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

రాజోలు: విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ ఠాకూర్ రామసింగ్ అన్నారు. మంగళవారం ఆయన రాజోలు నియోజకవర్గంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించారు. సబ్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ వినియోగదారులకు సక్రమంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఏపీఈపీడీసీఎల్ సభ్యుడు పి.వెంకటరామరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రాజబాబు, ఈఈ ఎం.రవికుమార్, బి.మల్లిక, వై.విజయానంద్, డీఈఈ సీహెచ్ శ్రీనివాసరావు, ఏఈ బొలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలకు సెలవేనా..?

- సచివాలయాల సేవలను కుదిస్తున్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు
- రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకునే దారేదీ?



మాచవరం సచివాలయం-4

అంబాజీపేట: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజం వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉన్న సచివాలయాల్లో అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంది. అయితే అంతకంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తానంటూ కల్లబొల్లి హామీలతో టీడీపీ కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు తూట్లు పొడుస్తోంది. ప్రజా సేవలకు కోత విధిస్తోంది. ప్రజలకు మరింతగా అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, రైతు భరోసా వంటి వాటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. ప్రజా సేవలను వరుసగా తగ్గిస్తోంది. ప్రస్తుతం కుల, ఆదాయ, వన్-బీ వంటి సాధారణ సేవలను మాత్రమే పొందుతున్నారు. దీంతో అన్నివర్గాల ప్రజలూ కూటమి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల హామీలను ఎలాగోలా హ్యాండిచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు సైతం మంగళం పాడేలా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఓవైపు వలంటీర్లను తొలగించి ఇంటి ముంగిట సేవలకు ఫుల్‌స్టాప్ పెట్టగా, సచివాలయ ఉద్యోగులకు గౌరవం లేకుండా కించపరిచేలా విధులను అప్పగిస్తూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజలకు సచివాలయాల్లో అందే సేవలన్నీ నిలిచిపోవటంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

545 రకాల సేవలు

నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను రూపుదిద్ది, ప్రజలకు 545 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్‌తో పాటు, ప్రజలను నిత్యం అవసరమైన సేవలను ఇంటి సమీపానికే తెచ్చారు. కొత్తపేట నియోజకవర్గంలో 87, రాజోలు నియోజకవర్గంలో 74, పి.గన్నవరం నియోజకవర్గంలో 76 సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించారు. ఈ సచివాలయాల్లో సుమారు 2,300 మంది ఉద్యోగులతో పాటు వలంటీర్లు ప్రజలకు సేవలందించారు.

ప్రజల ఆగ్రహం

సచివాలయ ఉద్యోగులతోనే సామాజిక పింఛన్లు పంపిణీ చేయించడం, ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేయటం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తప్ప మరి ఏ పథకానికి సంబంధించి దరఖాస్తులు చేయడం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అత్యవసరమైన రేషన్ కార్డులు కానీ, నూతన పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డులు, ఇంటి స్థలాలు, ఇతర ఏ పథకానికి సంబంధించి ఆన్‌లైన్ సైట్స్ ఓపెన్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

గ్రామాల్లో సేవలు కొనసాగించాలి



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాల్లో గత ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. గత ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా కొనసాగించాలి. పల్లె ప్రజలకు స్థానికంగా పథకాలను అందించి ఎక్కడికక్కడ వారి సమస్యలను పరిష్కరించాలి.

– మెన్నపు రాంబాబు, తొండవరం

వెబ్‌సైట్లు ఓపెన్ చేయాలి



గ్రామ సచివాలయ వలంటీర్ల సేవలను కొనసాగించాలి. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు ముగిసినా ప్రజలకు ఎలాంటి పథకాలూ అందడం లేదు. పేదలకు ఇది దారుణమైన పరిస్థితి. రైస్ కార్డులతో పాటు పింఛన్ దరఖాస్తుల వెబ్‌సైట్లు ఓపెన్ చేసి ప్రజలకు సేవలను అందించాలి.

– వి.ఇంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు, అంబాజీపేట

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలేవీ?

- అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు
- తమ దృష్టికి రాలేదంటూ తహసీల్దార్ సమాధానం
- కొన్ని శాఖల అధికారుల గైర్హాజరుపై ఎంపీడీవో ఆగ్రహం


రావులపాలెం మండల సర్వసభ్య సమావేశంలో ఇసుకపై తహసీల్దారు ముక్తేశ్వరరావును నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు

రావులపాలెం: మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ పలువురు ప్రజా ప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో రెవెన్యూ, పోలీస్ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఇసుక ద్వారా పంచాయతీలకు సీనరేజ్ నిధులు వచ్చేవని, ప్రస్తుతం ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించడంతో పాటు సీనరేజ్ కూడా రద్దు చేసిందన్నారు. దీంతో పంచాయతీలకు ఆదాయం లేకుండా పోయిందన్నారు. అయితే గతంలో గోదావరి వరదల సమయంలో స్టాక్ పాయింట్ల వద్ద నిలువ ఉంచిన ఇసుకను టన్నుకు రూ.265 చొప్పున జిల్లా సాండ్ కమిటీ కలెక్టర్ ఆధ్వర్యంలో విక్రయాలు చేశారని, ఈ రూపంగా స్టాక్ పాయింట్-1 వద్ద 38 వేల టన్నులు, స్టాక్ పాయింట్-2 వద్ద 83 వేల టన్నులు ఇసుక విక్రయాలు చేశారన్నారు. దీనికి సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులు ఎక్కడ ఉన్నాయంటూ ప్రశ్నించారు. ఈ సమయంలో ఊబలంక ఎంపీటీసీ మల్లిడి లావణ్య, గోపాలపురం, కొమరాజులంక సర్పంచులు సబ్బితి మోహనరావు, కర్రి గోవిందకృష్ణారెడ్డి తదితరులు ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులను నిలదీశారు. మండలంలో గోపాలపురం, ఊబలంక ర్యాంపుల్లో యథేచ్ఛగా ట్రాక్టర్లతో తవ్వకాలు చేస్తున్నారని, దానిని రాత్రి సమయాల్లో లారీల్లో ఎగుమతి చేస్తున్నారని అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ఉచితం అంటున్నా ట్రాక్టర్ ఇసుక రూ.2 వేలు చెల్లిస్తే కాని లబ్ధిదారుడికి రావడం లేదని దీనిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారంటూ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఎంపీపీ నాగదేవి తహసీల్దార్‌ను కోరగా సీనరేజ్ నిధుల కోసం కలెక్టర్‌కు నివేదిస్తానని సమాధానం చెప్పి అక్రమ తవ్వకాలపై సమాధానం దాటవేస్తూ జీవో నెంబర్ 66 ప్రకారం గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వుకోవచ్చని సమాధానమిచ్చారు. దీనిపై సభ్యులు పర్యావరణ అనుమతులు లేకుండా, మైనింగ్ శాఖ అధికారులు గుర్తించకుండా ఎలా తవ్వకాలు చేస్తారంటూ ప్రశ్నించారు. అయితే అక్రమ తవ్వకాలు తన దృష్టికి రాలేదని వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ముక్తేశ్వరరావు బదులిచ్చారు. అలాగే ప్రొటోకాల్ విషయంలో స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా గ్రామాల్లో కార్యక్రమాలు చేస్తున్నారంటూ పలువురు సభ్యులు నిలదీశారు. అలాగే గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు ఎక్కువైపోయాయంటూ పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా సమాధానం చెప్పేందుకు ఎక్సైజ్ సీఐ హాజరుకాకుండా కానిస్టేబుల్ రావడంపై ఎంపీడీఓ మహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన సమాచారంతో సంబంధిత అధికారులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. అలాగే గ్రామాల్లో జ్వరాలు పెరిగిపోతున్నాయని పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఊబలంక శివారు తోకలంకలో విద్యుత్ స్తంభాలు పాడైపోయి శిథిలావస్థకు చేరాయని సుమారు 10 స్తంభాలను మార్చాల్సిన పరిస్థితి ఉందని ఎంపీటీసీ లావణ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ప్రభుత్వానికి నివేదించామని అనుమతులు రాగానే కొత్త వాటిని మారుస్తామని ఎలక్ట్రికల్ సబ్ ఇంజినీర్ సమాధానం చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు, తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

15లోగా వరి నాట్లు పూర్తి చేసుకోవాలి


ఇరుసుమండలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ రామ్మోహనరావు

అంబాజీపేట: రబీ సాగుకు సంబంధించి వరి నాట్లను వచ్చే నెల 15లోగా పూర్తి చేసుకునేలా రైతులు సన్నద్ధం కావాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జీవీ రామ్మోహనరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి జె.మనోహర్ అన్నారు. రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజనలో భాగంగా ఇరుసుమండలో రబీ ముందస్తు సాగుకు సమాయత్తంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏవో సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఏడీఏ, వ్యవసాయాధికారులు మాట్లాడుతూ నారుమడి వేసే సమయంలో ప్రతి రైతు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తెగుళ్లు తట్టుకునే రకాలైన ఎంటీయూ 1121 (శ్రీధృతి) ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధికి సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ కిలో విత్తనాలకు 10 గ్రాములు లేదా కార్బండిజమ్ 3 గ్రాములను కిలో విత్తనానికి కలిపి వేసుకోవాలన్నారు. నారుమడి వేసే సమయంలోను, అనంతరం రైతులు సస్యరక్షణపై దృష్టి సారించాలన్నారు. అధికంగా ఎరువుల మందులను విచక్షణారహితంగా వినియోగించవద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏ ఎన్.కిరణ్‌దుర్గ, ఆకుల దొరబాబు, దంతులూరి వెంకటసత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో ఆటల పోటీలు


అంతర్వేదిపాలెంలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆరో రోజు లైబ్రరీలో తొలుత మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని ఇందిర చిత్రపటం వద్ద గ్రంథాలయ నిర్వాహకురాలు వై.వెంకటలక్ష్మి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర క్రీడలను వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని వెంకటలక్ష్మి అన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అంబాజీపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందిర జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, స్వాతంత్ర్య పోరాటంలో మహిళల ప్రాతపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది


సబ్సిడీపై వరి విత్తనాల బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరోజ

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు మేడిద సరోజ, రావి నాగవెంకట లక్ష్మీదేవిల అధ్యక్షతన రైతులతో సమావేశాలను అధికారులు నిర్వహించారు. వరి పంటపై ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గురించి ఏవో పీవీ నరసింహారావు ఆయా సమావేశాల్లో రైతులకు వివరించారు. సబ్సిడీపై వరి విత్తనాల బ్యాగ్‌ల పంపిణీని ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు ప్రారంభించారు. రైతులు రావి త్రిమూర్తులు, యెనుముల ఆనంద్ కుమార్, మద్దాల భాను, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీ


ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా మంగళవారం మామిడికుదురులో ర్యాలీ నిర్వహించారు. నేటి నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని ఎంపీడీఓ తెలిపారు. ఈ ర్యాలీలో ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: పారిశుధ్యంతో పాటు పరిశుభ్రత ద్వారా అంటూ వ్యాధులు దూరం చేయవచ్చని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆలమూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ నినాదాలు చేశారు. ఏపీఎం ఎం.ధనరాజు, ఏపీఓ జి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో ఠాకూర్


అంతర్వేది ఆలయంలో ఠాకూర్‌కు స్వామి చిత్రపటం ఇస్తున్న సారథి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం ఏపీ రాష్ట్ర విద్యుత్ శాఖ (ఏపీ ఈఆర్‌సీ) చైర్మన్ టి.రామ్‌సింగ్ ఠాకూర్, మెంబర్ పీవీ రామారావులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికి, స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి, చైర్మన్ ఠాకూర్‌కు స్వామి చిత్రపటం అందజేశారు. కాగా స్వామివారి ఆలయంలో ఏపీ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి చిత్రపటాన్ని అర్చకులు ఆయనకు అందజేశారు. ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వినతిపత్రం

ఏపీ రాష్ట్ర విద్యుత్ శాఖ (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ టి.రామ్‌సింగ్ ఠాకూర్‌కు, ఎంపీపీ వీరా మల్లిబాబు మండలంలో నెలకొని ఉన్న విద్యుత్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు అంతర్వేది స్వామివారి దర్శనానికి వచ్చిన చైర్మన్ ఠాకూర్‌ను ఎంపీపీ కలిశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధుల నుంచి ఇప్పటికే వచ్చిన సమస్యలపై పత్రాల గురించి ఎంపీపీ, ఠాకూర్‌కు వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఠాకూర్ అన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: స్థానిక పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు చంద్రమౌళి భాస్కరం బ్రహ్మత్వంలో లక్ష బిల్వార్చన పూజ వైభవంగా జరిపించారు. నయనాల తమ్మారావు దంపతులతో పాటు పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్ని పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. హరిహరునికి లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. నీరాజన మంత్ర పుష్పం, సూర్య నమస్కారాలు, చండీ హోమం, రుద్రహోమం, తదితర పూజలను ఘనంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు లక్ష బిల్వార్చనల్లో కర్తలుగా పాల్గొన్నారు.

వ్యాఘ్రేశ్వరునికి...

అంబాజీపేట: వ్యాఘ్రేశ్వరంలో బాలాత్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వర స్వామి, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలోను, మాచవరంలో పార్వతీ రాజరాజేశ్వరి స్వామి, కందుల మల్లేశ్వర స్వామి వారికి మంగళవారం లక్ష పత్రి పూజలు జరిపారు.

ధైర్యంగా ఆరోగ్య జీవనం సాగించాలి

కొత్తపేట: హెచ్ఐవీ వ్యాధితో బాధపడుతన్న బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, తగిన పౌష్టికాహారం తీసుకుంటూ, ధైర్యంగా ముందుకు వెళ్లడం ద్వారా ఆరోగ్య జీవనం సాగించాలని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ గన్నవరపు దుర్గాప్రసాద్ సూచించారు. హెచ్ఐవీతో బాధపడుతున్న రోగులకు స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం వైరల్ లోడ్ టెస్టులు నిర్వహించారు. అమలాపురం ఏఆర్‌టీ నోడల్ సెంటర్ తరఫున స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఏసీ సెంటర్లో ఏఆర్టీ మందులు వాడుతున్న హెచ్ఐవీ బాధితులు 33 మందికి పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ మందులు వాడకం, రోగ నిరోధకశక్తి పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. అలా ముందుకు వెళితే సాధారణ మనిషి జీవిత కాలం ఎలా జీవనం సాగిస్తారో అలాగే ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడితే వారి ఆయుష్షు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోర్త వంశీ, డాక్టర్ దివ్య, హెడ్ స్టాఫ్ నర్స్ దేవీజనని, ఐసీటీసీ కౌన్సిలర్ మెల్లం దుర్గాప్రసాద్, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ అడబాల వెంకటరత్నం, ఏఆర్టీ ల్యాబ్ టెక్నీషియన్స్ షలోమి, సత్యవతి, ఏసుకుమారి తదితరులు పాల్గొన్నారు.

వానపల్లిలో సీఎం హామీల అమలుకు చర్యలు

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


వానపల్లిలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామానికి సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని నెరవేర్చే దిశగా స్థానిక అధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వానపల్లిలో గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పార్క్ ఏర్పాటు స్థలాన్ని కలెక్టర్ సాధిక అధికారులతో కలసి పరిశీలించారు. సర్వే నంబర్లు, మ్యాపుల ఆధారంగా సరిహద్దులను పరిశీలించారు. వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజున నిర్వహించిన గ్రామ సభల్లో భాగంగా సీఎం చంద్రబాబు వానపల్లి గ్రామ సభలో పాల్గొని గ్రామానికి పలు హామీలు ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. ఆ హామీలు నెరవేర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. దానిలో భాగంగా పళ్లాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ గ్రామ సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీవో పి.శ్రీకర్, తహసీల్దార్ వై.రాంబాబు, దేవస్థానం ఈఓ బి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పల్లి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆదర్శనీయురాలు


నగరంలో ఇందిర విగ్రహానికి నివాళులర్పిస్తున్న చిట్టిబాబు

మామిడికుదురు: మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ నేటి తరం నేతలకు ఆదర్శనీయురాలని కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. ఇందిరా జయంతిని నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఎస్ మూర్తి రోడ్డులోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని ఇందిర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

అంబాజీపేట: మాజీ ప్రధాని ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని మహిళలు రాజకీయాల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. దివంగత మాజీ ప్రధాని ఇందిర జయంతి సందర్భంగా మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మాచవరం పంచాయతీ వద్ద ఇందిర విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాచవరపు శివన్నారాయణ, ములపర్తి మోహనరావు, ఎండీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులు ఆపాలి

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకంలో 17 ఏళ్లుగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను అక్రమంగా తొలగిస్తున్నారని, ఇటువంటి చర్యలను వెంటనే ఆపాలని కోరుతూ మంగళవారం తాడేపల్లిలో పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్‌కు సంఘ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, మండలానికి చెందిన ఎం.పరంధామయ్య మంగళవారం ఫోన్‌లో స్థానిక విలేకరులకు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు పెంచాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ తొలగింపులపై న్యాయ విచారణ చేస్తామని, ఎవరికీ అన్యాయం చేయమని హామీ ఇచ్చినట్టు పరంధామయ్య తెలిపారు.